క్లుప్తంగా

విద్యా సామగ్రి ఇస్తే మంచిది


కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనను కలిసేందుకు, శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు, తదితరులు పూల బొకేలు, మొక్కలు, పూల దండలు, దుశ్శాలువలతో కాకుండా పేద విద్యార్థులకు ఉపకరించే పుస్తకాలు, పెన్నులు వంటివి ఇస్తే మంచిదని కలెక్టర్ కె.వెట్రి సెల్వి సూచించారు. నిండు మనస్సుతో అభిమానంతో శుభాకాంక్షలు చాలు అని పేర్కొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ


విభిన్న ప్రతిభావంతులకు సైకిళ్లను అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ ప్రాంగణంలో సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి అందజేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు అందజేసిన పెదవేగి మండలం లక్ష్మీపురానికి చెందిన ఇంద్రాదేవి, ద్వారకాతిరుమలకు చెందిన కడిమి ఆంజనేయులకు కలెక్టర్ చేతుల మీదుగా ట్రైసైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ జేడీకి సత్కారం

ఏలూరు(మెట్రో): విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా సేవలు అందించి ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్న పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూ బాబును కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నెహ్రూబాబును కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రి రెడ్డిలు శాలువతో సత్కరించారు. ఆయన సేవలను కొనియడారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఆర్అండ్‌బీ ఎస్ఇ జాన్ మోషే, జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్ కృపావరం మాట్లాడారు.

బంకా మృతి తీరని లోటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన వ్యాపారవేత్త బంకా రామ్మోహనరావు మృతి హిందూ యుజవన సంఘానికి, కళారంగానికి తీరని లోటని హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ మహా విద్యాలయ పూర్వపు చైర్మన్, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు రామ్మోహనరావు (74) సంతాప సభ హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): ఏలూరు ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విజుయల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా నూతన సంవత్సర వార్షిక క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఏపీ విజువల్లి చాంలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి వీరభద్రరావు, కార్యదర్శి ఒ.మదన్ తదితరులు పాల్గొన్నారు.

సక్షమ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని గారపాటి చౌదరి కార్యాలయంలో సక్షమ్ 2025 క్యాలెండర్‌ను చౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేత ఇందుకూరి అశోక చక్రవర్తి వర్మ, సక్షమ్ జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ కొండేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు సంబరం.. నేడు నైరాశ్యం

- ఆగిపోయిన ఆర్థిక సాయం
- నేతన్నల మోముల్లో దిగాలు
- జగన్ హయాంలో ఆదుకున్న నేతన్న నేస్తం
- ఏలూరులో 21 మందికి రూ.25 లక్షల లబ్ధి


మగ్గంపై చీర నేస్తున్న చేనేత కార్మికురాలు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ హయాంలో నేతన్నలు సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నేతన్నకు భరోసా కల్పించింది. క్రమం తప్పకుండా వరుసగా ఐదేళ్ల పాటు నెలకు రెండు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు నేతన్నల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమయ్యాయి. ఏలూరు నియోజకవర్గం పరిధిలో గత ఐదేళ్లలో చేనేత కార్మికులకు రూ.25 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. నేడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. నేతన్న నేస్తం పథకంలో నిధులు జమ చేయడం లేదు. ఫలితంగా నేతన్నలకు ఆర్థిక సాయం ఆగిపోయింది. రోజంతా కష్టపడితే వచ్చే రూ.100 నుంచి రూ.200 ఆదాయంతో తమ కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని నేతన్నలు వాపోతున్నారు. నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగించాలని వారు కోరుతున్నారు.

ప్రశ్నార్థకంగా చేనేత వృత్తి

చేనేత కార్మికులు ప్రస్తుతం నిరాశ, నిస్పృహల్లో కొట్టు మిట్టాడుతున్నారు. సొంత వృత్తిని వదిలేసి బట్టల షాపుల్లో సేల్స్ బాయ్స్‌గా, బట్టల మూటలు కట్టుకుని గ్రామాల్లో తిరుగుతూ, ఇతర స్వయం ఉపాధి పనుల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. చేనేత రంగంపై ప్రభుత్వం దృష్టి సారించక పోతే అనాదిగా దేశంలో ఉన్న చేనేత వృత్తి పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని చేనేత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. వృత్తిదారులకు మగ్గాలు, తక్కువ ధరకు దారాలు, రంగులు తదితరాలు అందించాలని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగించాలని వారు కోరుతున్నారు.

నేతకు దూరమయ్యే పరిస్థితి



చాలీచాలని రాబడితో చేనేత వృత్తిని వదిలేసి వేరే పనులు చేసుకుందామనుకున్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రవేశ పెట్టిన నేతన్న నేస్తం పథకం నేతన్నలను ఆదుకుంది. వృత్తికి చేరువ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది. నేడు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నేతన్నల నిర్లక్ష్యం చేయడంతో మా జీవితాల్లో చీకటి అలముకుంది. వృత్తికి పూర్తిగా దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

– పేరక వెంకటేశ్వరరావు, నేతన్న నేస్తం లబ్ధిదారుడు, శనివారపుపేట, ఏలూరు

నేతన్నలను ఆదుకోవాలి



వైఎస్సార్ సీపీ హయాంలో సంబరాలు చేసుకున్న నేతన్నలు నేడు పూర్తిగా దిగాలుగా ఉన్నారు. నాడు ఏలూరు ప్రాంతంలో ఉజ్వలంగా ఉన్న నేతన్నల పరిస్థితి నేడు కడు దయనీయంగా మారింది. పెద్ద సంఖ్యలో నేతన్నలు వృత్తిని వదిలేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలో 21 మంది సొంత మగ్గం ఉన్న నేతన్నల సంఖ్య నేడు 10కి పడిపోయింది. నేతన్నల బతుకుల్లో వెలుగులు నింపేలా పాలకులు చర్యలు తీసుకోవాలి.

– పిచ్చుక ఆదిశేషు, జిల్లా కార్యదర్శి, ఏపీ చేనేత కార్మిక సంఘం, ఏలూరు జిల్లా

ఆకట్టుకున్న ‘శ్రీ రామాంజనేయ యుద్ధం’


శ్రీ రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, పౌరాణిక నాటక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ, విశేష అలంకరణ చేశారు. స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం టి.సూర్య పద్మకుమారి అన్నమాచార్య కీర్తనలను ఆలపించి అలరించారు. నగరానికి చెందిన గుడిపాటి లలిత శ్రీ కృష్ణ లీలా తరంగిణి అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 8 గంటలకు నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ పర్యవేక్షించారు.

పోలీసు శాఖ సూచనలు పాటించాలి


డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకలు, సంబరాలు పోలీసు వారి అనుమతులతో, వారు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, వారికి వాహనాలు ఇస్తే వాటి యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలకు సైలెన్సర్లు తీసి వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు వారి అనుమతి లేకుండా ఏ విధమైన ఈవెంట్లను నిర్వహించరాదని, 31వ తేదీ రాత్రి సమయంలో ఈవెంట్లు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు వారి వద్ద పర్మిషన్ తీసుకోవడంతో పాటు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏపీ పబ్లిక్ సేఫ్టీ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం ఈవెంట్లు నిర్వహించే ప్రదేశాలలో వీడియో రికార్డింగ్ సీసీ కెమెరాలను తప్పనిసరిగా అమర్చాలని తెలిపారు. ఈవెంట్లలో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను అతివేగంగా, ప్రమాదకరంగా నడపరాదని, కోడిపందేలు, పేకాట వంటి మొదలైన అసాంఘిక కార్యక్రమాలు నిషిద్ధమన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 112కి కాల్ చేయాలని సూచించారు. రాత్రి సమయంలో రోడ్లపై మందు గుండు సామగ్రిని పేల్చరాదని, నూతన సంవత్సర శుభాకాంక్షలు పేరుతో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు రాత్రి సమయంలో రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తారని, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని డీఎస్పీ సూచించారు.

కేవీఎస్‌కు నాట్య భూషణ్ అవార్డు



కేవీఎస్‌కు అవార్డు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు, సినీ నృత్య దర్శకుడు కేవీ సత్యనారాయణకు నాట్య భూషణ్ అవార్డు లభించింది. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, విశాఖ బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ శాస్త్రీయ నాట్య సమ్మేళనం నిర్వాహకులు కేవీఎస్‌కు ఈ అవార్డును అందజేశారు. ఈ వివరాలను ఆయన ఏలూరులో పత్రికలకు సోమవారం విడుదల చేశారు. ఈ నెల 29న విశాఖ సాగర తీరంలోని వేదికపై తాను రచించి విడుదల చేసిన కూచిపూడి నృత్యాల పాటల క్యాసెట్‌ను రిలీజ్ చేసి, అందులోని పాటలు ఎటువంటి కాపీరైట్ అవసరం లేకుండా నాట్య కళాకారులు వినియోగించ కోవచ్చునని ప్రకటించామని తెలిపారు. 2025 సంవత్సరంలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ శాస్త్రీయ నాట్య సమ్మేళనానికి చైర్మన్‌గా తనను ప్రకటించారని వివరించారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలి

బుట్టాయగూడెం: యువకులు, విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాలని ఐటీడీఏ ఏపీఓ పీవీఎస్ నాయుడు సూచించారు. కోట రామచంద్రాపురం ఐటీడీఏ సమీపంలోని గురుకుల కళాశాల వద్ద సోమవారం ఓఎన్‌జీసీ (రాజమండ్రి) సామాజిక బాధ్యత పథకంలో గిరిజన యువత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఓ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యం ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ సంబంధించిన పుస్తకాల కిట్‌లను పంపిణీ చేశారు. ఓఎన్‌జీసీ డీజీఎం సోమ్‌నాథ్, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు, స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణులు శ్రీనివాసరావు, షేడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్ కుమార్, సీఎంసీ (విశాఖపట్నం) సీఈఓ జగదీష్, ఫోర్బ్స్ ఫొటోగ్రాఫర్ వికాశ్ పురేటి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో 1996లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఆహ్లాదపూరిత వాతావరణంలో జరిగింది. పిల్లెం శ్యామ్ తంబి, కృష్ణాజీ ఇతర విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గుల్ల ప్రసాద్, జి సాంబశివరాను పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఫొటో దిగి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత విద్యార్థి నాయకులు శ్యామ్ తంబి, కనకరాజు, కృష్ణాజీ మాట్లాడుతూ వేలాదిమందికి విద్యాబుద్ధులు నేర్పించిన దాత గారపాటి హైమావతి దేవి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు.

ఉద్యమాల్లోనూ ముందుండాలి


యశ్వంత్


సునీల్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చదువుతో పాటు ఉద్యమాల్లోనూ ముందుండి సమస్యలపై పోరాటాలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలిపునిచ్చారు. పీడీఎస్‌యూ ఏలూరు నగర జనరల్ కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఎం యశ్వంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కాషాయీకరణ పేరుతో విద్యా వ్యవస్థలో ఆర్ఎస్ఎస్ అనుకూల విధానాలని ప్రవేశపెడుతోందని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక ఫైర్ స్టేషన్ నుంచి ర్యాలీగా ఫ్లైఓవర్ మీదుగా పీడీఎస్‌యూ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం విద్యార్థులు కొత్త కార్యవర్గాన్ని 17 మందితో ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం యశ్వంత్, సొంగ సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు మాట్లాడుతూ పీడీఎస్‌యూ బలోపేతానికి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

మానవత డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా అజయ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మేతర అజయ్‌బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా మేతర అజయ్‌బాబు ఎన్నికయ్యారు. మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం సోమవారం స్థానిక లేడీస్ క్లబ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తోటి వారికి సహాయం చేయడానికి, ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత సంస్థను ఏర్పాటుచేశామన్నారు. చనిపోయిన వారి అంతిమ క్రియలకు ఆసరాగా ఫ్రిజ్ బాక్సులు, శాంతి రథాలు అందజేస్తున్నామని తెలిపారు. మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, మారుబోయిన కోటేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల రత్నకర్ రావు, మానేపల్లి సత్యనారాయణ, పోదూరు కనకదుర్గ పాల్గొన్నారు.

అమిత్‌షాను తొలగించాలి

పెదపాడు: పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదపాడు బల్లరేవుతూము సెంటర్‌లో సీపీఎం నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేసారు. సీపీఎం శాఖా కార్యదర్శి గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ఉంగుటూరు: సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రజావాణి నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే ఈ ప్రజా వాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు


మాట్లాడుతున్న కళాశాల ప్రతినిధులు

దెందులూరు: విద్యాబోధనలో నూతన టెక్నాలజీని అనుసంధానం చేస్తూ అభివృద్ధి చెందుతున్న దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధి వేగవరంలో ఉన్న హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు జరిగాయని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని చైర్మన్ ఈవీ రమేష్ తెలిపారు. సోమవారం కాలేజీ ఆవరణలో కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్, ట్రెజరర్ ఎం వెంకయ్య, ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల నగదు కాలేజీలో కొంతమంది వాడేసుకున్నారని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాలేజీ మేనేజ్‌మెంట్ మాట్లాడుతూ కొన్ని సోషల్ మీడియాలో గ్రూపుల్లో కొంతమంది పనిగట్టుకుని మంచి పేరు ఉన్న కాలేజీ ఉన్నతిని, అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం


ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న అధికారులు

భీమడోలు: రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భీమడోలు మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. కోడూరుపాడు, దుద్దేపూడిలో సోమవారం మీ భూమి– మీ హక్కుపై గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేలో గుర్తించిన తప్పులను సరి చేసేందుకు అన్ని చర్యలు చేపడతామన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ గతంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ గ్రామాలను ఎంపిక చేసి భూసర్వే నిర్వహించామన్నారు. 18 మంది రైతులు ఫిర్యాదు చేయగా వాటిలో ఒకటి మాత్రమే పరిష్కరించారు. భూ సర్వేను ఇష్టానుసారంగా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. పలు ధ్రువీకరణలను అర్జీదారులకు అందించారు. ఆర్ఐ కిరణ కుమారి, మండల సర్వేయర్ ధర్మారావు, ఎంపీటీసీ పొల్నాటి శ్రీను, వీఆర్వో సోమయ్య, కార్యదర్శి ధర్మా, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబితాలో దోషాలను సరిచేయాలని వినతి

భీమడోలు : హిందూ మాలగా ఉన్న వారిని క్రైస్తవ మాలగా సర్వేలో నమోదు చేశారని, దీంతో చాలామంది ఎస్సీ రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని, కుల గణన సర్వేలో సచివాలయ సిబ్బంది తప్పులు చేశారని, వాటిని సరి చేయాలని సోమవారం భీమడోలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భీమడోలు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవికి వినతిపత్రం అందించారు. ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా చాలామంది భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, సర్వేలో నమోదైన కుల జాబితాలను తమకు అందజేయాలని, తప్పులుంటే ఉన్నతాధికారులు సరిదిద్దుకునే వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి, కాటూరి జోగేశ్వరరావు, ఉండి నాగరాజు మాట్లాడుతూ మాదిగ హిందూగా నమోదు కావాల్సి ఉండగా మాదిగ క్రైస్తవుడిగా నమోదు చేశారని, దీని వల్ల మాదిగలు బీసీలుగా మారే అవకాశాలున్నాయని, అధికారులు తప్పులపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల నుంచి పలువురు దరఖాస్తులు, ఫిర్యాదులు చేశారు.